గ్యారెంటీల గారడీతో బొక్కబోర్లా

- హర్యానా తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- గ్యారెంటీలకు వారంటీ లేదని తేలిపోయింది
- రాహుల్‌గాంధీ ఇప్పటికైనా బుద్ధితెచ్చుకోవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'అలవి కాని హామీలతో గద్దెనెక్కాలని చూసిన కాంగ్రెస్‌కు జనం కర్రుకాల్చి వాత పెట్టారు. హర్యానా ప్రజల తీర్పుతో గ్యారెంటీలకు వారెంటీ లేదని స్పష్టంగా తేలిపోయింది. -కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హర్యానా ప్రజలు కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కర్ణాటకలో 5గ్యారెంటీలు, తెలంగాణలో 6 గ్యారెంటీలని అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, 7 గ్యారెంటీల పేరిట హర్యానా ప్రజలను మభ్యపెట్టాలని చూసిందని, కానీ అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టారని విమర్శించారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తున్నద ని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాంతీయ పార్టీలకే సత్తా

కాంగ్రెస్‌తో హోరాహోరీ ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తున్నదని కేటీఆర్ తెలిపారు. ఆ పార్టీ ఓటమికి రాహుల్ గాంధీ బలహీన నాయకత్వం కూడా ప్రధాన కారణమని స్పష్టంచేశారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకే ఉన్నదని, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఫలితాలు కూడా రెండు జాతీయ పార్టీలకు ఏమాత్రం ఆశాజనకంగా ఉండే అవకాశం లేదని తెలిపారు. ఈ ఫలితాలు చూస్తుంటే 2029లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు సాధారణ మెజార్టీ సాధ్యం కాదన్నది తెలిసిపోతున్నదని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ బుల్డోజర్‌రాజ్‌లు, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే వ్యవహారాలు నడుస్తుంటే రాహుల్ గాంధీ చూసీ చూడనట్టు వ్యవహరించిన తీరును దేశం గమనిస్తున్నదని, పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగిన చందంగా తాను చేసే పనులను ప్రజలు గుర్తించరని భావించటం రాహుల్‌గాంధీ అమాయకత్వమని పేర్కొన్నారు.

> హర్యానాలో ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలి. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలుచేయకుంటే కాంగ్రెస్‌కు ఇంతకంటే పెద్ద ఎదురు దెబ్బలు తప్పవు. -కేటీఆర్

దండగ మారి పాలనలో పస్తులు

పండుగ సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కుటుంబాలను పస్తులుంచొద్దని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. 'దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు' అని ఘాటుగా విమర్శించారు. పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, హాస్పిటల్ సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్ ఇలా ప్రతిశాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడుతున్నారని తెలిపారు.

గౌతంగౌడ్ పోస్టులో తప్పేముంది?

జర్నలిస్టు గౌతంగౌడ్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో తప్పేముందని డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ వీడియో షేర్ చేసినందుకు కేసు పెడతారా? అని ఎక్స్ వేదికగా ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రైతు మల్లయ్యను వారి స్వగ్రామంలో తాను కూడా కలిశానని, రైతు పరిస్థితి ఎలా ఉందో ఆరా తీశానని, అంతమాత్రానికే కేసు పెడతారా? అని ప్రశ్నించారు.

> కాంగ్రెస్‌తో పోటీ ఉన్న చోటే బీజేపీ గెలుస్తున్నది.. బీజేపీని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉన్నదనే విషయం ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు స్పష్టం చేసినయ్. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉన్నది. -కేటీఆర్

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది!

- కాంగ్రెస్‌ను ఈడ్చికొట్టిన హర్యానా ఓటర్
- ఏడు గ్యారెంటీలతో ఏమార్చాలనుకొన్న హస్తానికి దిమ్మదిరిగేలా భారీ షాక్
- కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ఎఫెక్ట్‌తో అప్రమత్తమై.. ఎవరూ ఊహించని తీర్పు
- మ్యాజిక్ మార్క్‌కు 9 సీట్ల దూరంలో స్టాప్
- 3 రాష్ట్రాల్లో వైఫల్యాలే మెమొరాండంగా జవాబు

> కాంగ్రెస్ అధిష్ఠానం భయపడినట్టే అయ్యింది. కర్ణాటక, తెలంగాణను చూపించి హర్యానాలో, దాన్ని చూపించి రానున్న మహారాష్ట్ర ఎన్నికల్లో పాగా వేయాలనుకొన్న హస్తం నేతలకు పెద్ద షాక్ తగిలింది. కర్ణాటక, తెలంగాణలో పాలనా వైఫల్యాలు హర్యానా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపొచ్చన్న రాహుల్‌గాంధీ హెచ్చరికలే చివరకు నిజమయ్యాయి.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఏమోగానీ.. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హర్యానాలో కాంగ్రెస్ ఏడు గ్యారెంటీల వ్యూహం బెడిసికొట్టింది. 10 గ్యారెంటీలంటూ హిమాచల్‌ను దివాలా తీసేలా చేసి, 5 గ్యారెంటీల పేరిట కర్ణాటకను అథోగతి పాల్జేసి, 6 గ్యారెంటీలంటూ తెలంగాణను నిండాముంచిన కాంగ్రెస్ చేష్టలను హర్యానా ఓటర్ జాగ్రత్తగా గమనించాడు. అదును చూసి సిరా చుక్కతో కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఎంతలా అంటే, హర్యానా పీఠం కాంగ్రెస్‌దే అని అన్ని ఎగ్జిట్ పోల్స్ ఢంకా భజాయించి చెప్పినా.. మా తీర్పే సపరేటు అన్నట్టు ఓటరు మహాశయుడు వ్యవహరించాడు. వెరసి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, హర్యానాలో మెజారిటీ మార్క్‌కు ఆమడ దూరంలో కాంగ్రెస్ ఉసూరుమన్నది.

ఊరించి.. ఉసూరుమనిపించి..

హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 5న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈ సారి కాంగ్రెస్‌కే ఓటరు పట్టం కడతాడంటూ అన్ని ఎగ్జిట్ పోల్స్ తమ అంచనాలను వెలువరించాయి. అయితే, మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఓటరు వినూత్నమైన తీర్పునిచ్చాడు. 7 గ్యారెంటీలతో ఆకట్టుకోవాలనుకొన్న హస్తానికి రిక్తహస్తం ఇచ్చాడు. 90 స్థానాలకు గానూ కాంగ్రెస్‌ను 37 స్థానాలకే పరిమితం చేశాడు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 46 మ్యాజిక్ ఫిగర్‌కు 9 సీట్ల దూరంలో హస్తాన్ని నిలువరించాడు. తొలుత ట్రెండ్స్‌లో కాంగ్రెస్ మెజారిటీ మార్క్‌ను దాటి 48కి పైగా స్థానాల్లో ముందంజలో ఉన్నట్టు ఫలితాల సరళి నమోదైంది. దీంతో హర్యానా పీఠం తమదేనని కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి మిఠాయిలు పంచుకొంటూ పటాకులు కాల్చారు. అయితే, 3, 4 రౌండ్ల నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రకటించిన అన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థులు వెనుకంజలో ఉండటం కనిపించింది. చివరకు 37 స్థానాలకే పరిమితమైంది.

ఏడు హామీలతో ఆకట్టుకోవాలని..

హిమాచల్ ప్రదేశ్‌లో 10 గ్యారెంటీలు, కర్ణాటకలో 5 గ్యారెంటీలు, తెలంగాణలో 6 గ్యారెంటీలతో అధికారాన్ని చేజిక్కించుకున్నట్టే హర్యానాలో 7 గ్యారెంటీల పేరిట పీఠాన్ని ఎక్కాలని కాంగ్రెస్ భావించింది. రాష్ట్ర బడ్జెట్ పరిమితి కూడా పట్టించుకోకుండా మ్యానిఫెస్టోలో 7 గ్యారెంటీల పేరిట అలవిగాని హామీలను కురిపించింది. మహిళలకు నెలకు రూ. 2 వేలు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ. 6 వేలు, రూ. 500కు ఎల్పీజీ, రూ. 25 లక్షల ఉచిత వైద్యం, 100 గజాల స్థలంతో ఇండ్లు, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, కులగణన, ఓల్డ్ పెన్షన్ స్కీమ్, ఎమ్మెస్పీకి చట్టబద్ధత వంటి హామీలిచ్చింది. ఇవన్నీ అమలు చేయాలంటే రూ. 1.90 లక్షల కోట్లు ఉన్న రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా ఏకంగా రూ. 70 వేల కోట్లు (బడ్జెట్‌లో 37 శాతం) అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. హామీలకే ఇంత కేటాయింపులు పోతే, అభివృద్ధి, పాలన, సంక్షేమం మాటేమిటని విమర్శలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ముందుకే వెళ్లింది.



అప్రమత్తమైన హర్యానా ఓటరు

కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో హిమాచల్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా అంచుకు చేరింది. చివరకు పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి నిధులను తీసుకొనే స్థాయికి దిగజారింది. గ్యారెంటీలకు, రాయితీలకు కోత పెట్టింది. కర్ణాటకలో 5 గ్యారెంటీల అమలుకు పెట్రోల్, డీజిల్ ధరలను సర్కారు అమాంతం పెంచింది. సేల్స్ ట్యాక్స్ పేరిట వడ్డింపులకు తెరతీసింది. ఇక, ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పది నెలల్లోనే తెలంగాణను అప్పుల కుప్పగా మార్చింది. ఒకటి అరా హామీలు మినహా మరే ఇతర గ్యారెంటీలను అమలు చేయలేదు. పైగా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకొంటూ విమర్శలు మూటగట్టుకొన్నది. ఇవన్నీ గమనించిన హర్యానా ఓటరు ఎంతో చాకచక్యంగా వ్యవహరించాడు. 7 గ్యారెంటీల వలలో పడితే తమ పని కూడా ఇంతేనని ముందే గ్రహించాడు. అసత్యాల హస్తానికి సిరా చుక్కతో గట్టి దెబ్బ కొట్టాడు.

దివాలా అంచున హిమాచల్

2022 చివర్లో జరిగిన హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. ఇదేమీ పట్టించుకోకుండా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది. ఆఖరికి పెన్షన్ల శాఖలో ఉండే పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి సైతం ప్రభుత్వం డబ్బును వాడుకుంది. మొత్తం 14 సబ్సిడీలపై కోతలు విధించేందుకు సిద్ధమైంది. తమ జీతాలు రెండు నెలలు వాయిదా వేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. కాంగ్రెస్ పాలనలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు భారం ఉంది.

పన్నులతో కర్ణాటకలో మోత

5 గ్యారెంటీలను ఆశగా చూపెట్టి కిందటి ఏడాది మేలో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలపై పన్నుల వాతను కొనసాగిస్తున్నది. ఐదు హామీల అమలుకు అవసరమైన నిధుల కోసం సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నది. పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచుతూ నోటిఫికేషన్ జారీచేసింది. పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 25.92 నుంచి 29.84 శాతానికి (3.92 శాతం పెరుగుదల), డీజిల్‌పై 14.3 శాతం నుంచి 18.4 శాతానికి (4.1 శాతం పెరుగుదల) పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. ఐదు హామీలను అమలు చేయాలంటే రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.52 వేల కోట్ల భారం పడుతుంది. దీంతో గ్యారెంటీల అమలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోడానికి ఛార్జీల పెంపు, పన్ను వసూళ్లకు సర్కారు తెగబడుతున్నది. గైడెన్స్ వాల్యూ ట్యాక్స్, దేశీయ లిక్కర్‌పై, బీర్లపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ, కొత్తగా రిజిస్టరైన రవాణా వాహనాలపై అదనపు సెస్, రూ.25 లక్షల పైబడిన ఎలక్ట్రికల్ వాహనాలపై లైఫ్‌టైమ్ ట్యాక్స్ విధించింది. ఇక, 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీసింది. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీంకు కొత్త ఆంక్షలు జోడించింది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చింది. బస్సు సర్వీసులను తగ్గించింది. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీంలోనూ కోతలు విధిస్తున్నది. అంతేకాదు, ముడా, వాల్మీకి తదితర స్కాంలతో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు చిరునామాగా మారింది.

తెలంగాణ 'హస్త'వ్యస్తం

6 గ్యారెంటీల పేరిట తెలంగాణలో నిరుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అటకెక్కించింది. ఒకటీ, అరా పాక్షికంగా అమలు చేసి చేతులు దులుపుకొన్నది. మహాలక్ష్మి పథకంలో ప్రధానమైన హామీ ప్రతీ మహిళకు నెలకు రూ. 2,500 సాయం ఇంకా అమలుకాలేదు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత వంటి హామీలను గాలికొదిలేసింది. రుణమాఫీ అంటూ ప్రకటించి అభాసుపాలైంది. 10 నెలల వ్యవధిలో రూ. 73 వేల కోట్ల అప్పుచేసి రాష్ట్రాన్ని అథోగతిపాల్జేసింది. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చెరువుల పరిరక్షణ పేరిట హైడ్రాను తెరమీదకు తెచ్చిం ది. పేదల ఇండ్ల కూల్చివేతే టార్గెట్‌గా హైడ్రా చర్యలు ఉండటంతో ప్రజాక్షేత్రం నుంచి విమర్శలపాలైంది. ఆర్‌ఆర్‌ఆర్ రూట్ మ్యాప్, మూసీ రివర్ ఫ్రంట్‌లో పెద్దయెత్తున అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు రావడంతో రేవంత్ సర్కారుపై ఢిల్లీలోని అధిష్ఠానం కూడా ఒకింత ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం.

జాతీయ పార్టీలపై ప్రజల్లో విముఖత

కశ్మీర్, హర్యానా ఫలితాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): కాశ్మీర్‌లో బీజేపీని, హర్యానాలో కాంగ్రెస్‌ను విశ్వసించలేదని, రెండు జాతీయ పార్టీలపై ప్రజల్లో విముఖత ఉన్నదనేది స్పష్టమైందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల గారడీని హర్యానా ప్రజలు విశ్వసించలేదని ఫలితాలు తేల్చిచెబుతున్నాయని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేసిన మోసాన్ని హర్యానా ప్రజలు నిశితంగా గమనించారని పేర్కొన్నారు. ఈ ఫలితాలు చూసిన తర్వాత అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతీకార, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకొని, ఆరు గ్యారెంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు.

రేవంత్‌రెడ్డికి ఆశాభంగం!

- ఢిల్లీ నుంచి నిరుత్సాహంతో వెనుదిరిగిన సీఎం
- హర్యానా ఓటమితో అంతా తలకిందులు

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : హర్యానా ఎన్నికల్లో గెలిస్తే తెలంగాణ మోడల్ గెలిచిందని ప్రచారం చేసుకోవాలని ఉవ్విళ్లూరిన సీఎం రేవంత్‌రెడ్డికి శృంగభంగం తప్పలేదు. అనూహ్యంగా కాంగ్రెస్ ఓటమిపాలవ్వడంతో రేవంత్‌రెడ్డి ఎవరితోనూ మాట్లాడకుండా.. ఎవర్నీ కలవకుండా నిరుత్సాహంతో రాష్ట్రానికి తిరిగి పయనమయ్యారని తెలిసింది. ఎలాగూ కాంగ్రెస్ గెలుస్తుంది కాబట్టి ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ తెలంగాణ మోడల్ గెలిచిందని ప్రచారం చేయాలని రేవంత్‌రెడ్డి తొలుత భావించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి మీడియా వాళ్లకు సమాచారం కూడా ఇచ్చారు. కానీ తీరా ఫలితాలు తారుమారు కావడంతో ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్‌ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్‌ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధాని లోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.



ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వ్‌బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్రానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్‌ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్‌ఎస్‌ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.